నగర శివార్లలో ఉపాధి ప్రణాళికపై కసరత్తు

- 2025-26 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం
- ఉపాధి పనుల్లో చెరువు పూడికతీత, ఫీడర్ కాలువలు, కందకాలు తీయటం
- వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు గుంతలకు అధిక ప్రాధాన్యం

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలో మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో (మేటీరియల్ కాంపొండ్‌తో కలిపి) అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి సంస్థలు (డీఆర్డీఏ)కసరత్తు చేస్తున్నాయి. వచ్చే ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు ఉపాధి కూలీలు చేపట్టనున్న పనులకు సంబంధించిన కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించారు. శివారు జిల్లాల్లో 1,78,867 మంది కూలీలకు 11.83 లక్షల పని దినాల్లో రూ. 27.95 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులు చేపట్టాలన్న లక్ష్యాన్ని అధిగమించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 17,832 మంది కూలీలకు 1.71 లక్షల పని దినాల్లో రూ.5.30 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనుల నిర్వాహణకు చర్యలు తీసుకుంటున్నారు. కూలీలకు వంద రోజులు పనిని కల్పించటం ద్వారా పేదల జీవనోపాధిని మెరుగు పరిచేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. నగర శివారు జిల్లాల్లో మొత్తంగా 620 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇటీవల సర్కారు 40 గ్రామ పంచాయతీలను సమీపంలోని 11 పురపాలక సంఘాల్లో విలీనం చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న 580 గ్రామ పంచాయతీల్లోనే ఉపాధి హామీ పనులు జరిగేలా ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి సంస్థలు కార్యాచరణ కార్యక్రమాన్ని ఖరారు చేస్తున్నాయి.

పనులిలా

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు మేడ్చల్ జిల్లాలో 2,369 మంది కూలీలకు 37,631 పని దినాలను కల్పించటం ద్వారా సామాగ్రితో కలిపి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ అభివృద్ధి పనుల విలువ రూ.4 కోట్ల వరకు ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రతీ రోజు 127 నుంచి 282 మంది కూలీలు ఉపాధి పనుల్లో నిమగ్నమై పని చేస్తున్నారు.
- రంగారెడ్డి జిల్లాలో కూడా ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు 10.12 లక్షల పని దినాలను కల్పించిన డీఆర్డీఏ రూ.22.64 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొంటోంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువు పూడికతీత పనులతో పాటు కందకాలు తవ్వటం, ఫీడల్ కాలువల నిర్మాణం, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటటానికి గుంతలు తవ్వటం వంటి పనులను కూలీలు చేపట్టారు.

ఉపాధి హామీ పథకంలో గుర్తించిన పనులివే

ఉపాధి హామీ పథకంలో భాగంగా నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు ప్రక్రియను అధికార యంత్రాంగం ప్రారంభించింది. ఉపాధి పనుల్లో భాగంగా ఊట కుంటలు, కందకాలు తవ్వటం, ప్రభుత్వ స్థలంలో మొక్కలు పెంచటం, పల్లె ప్రకృతివనాలు, రైతు కళ్లాలు, ప్రభుత్వ స్థలంలో నేలను చదును చేయటం, ఎండిపోయిన బోరు బావుల రీచార్జి, వైకుంఠ దామాలు, ప్రభుత్వ సంస్థలకు రోడ్లు వేయటం, డంపింగ్ యార్డులు, కామన్ ల్యాండ్ సోక్ ఫిట్స్, కొత్తగా నిర్మించిన రహదారులపై గ్రావెల్ వేయటం, కంపోస్ట్ ఎరువుల గుంతలు, ఫీడర్ కాలువలు వంటి పనులను కూలీలు చేపట్టనున్నారు. అలాగే, పశువులు, గొర్రెలు, మేకలు, పండ్ల తోటల నిర్మాణం, తాటి వనాలు పెంచటం, చేపల కుంటలు, మిషన్ భగీరథ కోసం కందకాలు, మైనర్ ఇరిగేషన్ కాలువల్లో పూడిక తీయటం, వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీయటం వంటి ఉపాధి పనులు కూడా కూలీలు చేపట్టనున్నారు.

2024లో అందరినీ ఆదరించిన మేడ్చల్

- హీరోలు జీరోలు అయ్యారు
- రాజకీయ నిరుద్యోగులకు అవకాశం కల్పించిన జిల్లా

మేడ్చల్: మేడ్చల్ జిల్లాలో మేడ్చల్, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, ఉప్పల్, కూకట్‌పల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. 5 నియోజకవర్గాల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చెందిన నాయకులే ఎమ్మెల్యేలుగా గెలిచారు.

మల్లారెడ్డి సైలెంట్ మోడ్..

మాటలు, విచిత్ర చేష్టలతో అనతికాలంలోనే రాష్ట్ర రాజకీయాల్లో, ప్రధానంగా బీఆర్ఎస్‌లో ఫైర్ బ్రాండ్‌గా ఎదిగిన మాజీమంత్రి మల్లారెడ్డి సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనతోపాటు అల్లుడు రాజశేఖర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకున్నా జిల్లా పరిధిలో ఎక్కడా నోరు విప్పడం లేదు. ప్రతిపక్షంలో ఉంటూ అధికార పక్షాన్ని పల్లెత్తు మాటసైతం అనకుండా సైలెంట్ అయ్యారు. సంవత్సర కాలంగా మల్లారెడ్డి తీరు ఎవరికీ అర్థం కావడంలేదు.

ఈటలను ఆదరించిన మేడ్చల్ మల్కాజ్‌గిరి

అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర రాజకీయల్లో ఓ వెలుగు వెలిగిన మాజీమంత్రి ఈటల రాజేందర్ గత అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్, హుజూరాబాద్‌ల నుంచి పోటీ చేసి ఓడిపోవడంతో భవిష్యత్ రాజకీయం ప్రశ్నార్థకంగా మారింది. 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాకు మల్కాజ్‌గిరి ఎంపీ స్థానం నుంచి పోటీ చేయడంతో జిల్లా ప్రజలు ఆదరించి ఎంపీగా గెలిపించి ఈటల భవిష్యత్‌ను నిలబెట్టారు.

కాంగ్రెస్‌లోకి కొనసాగిన వలసలు..

అధికారం మారడంతో మేడ్చల్ జిల్లాలోని స్థానిక సంస్థల్లోనూ అధికారం మారింది. ప్రధానంగా మేడ్చల్ నియోజకవర్గంలోని ఏడు మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్‌లలో పలువురు నాయకులు బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరిపోయారు. ప్రధానంగా కౌన్సిలర్ స్థాయి నుండి అగ్రశ్రేణి నాయకుడి వరకు కాంగ్రెస్‌లో చేరిపోయారు.

కాంగ్రెస్‌లో పెరిగిన వర్గ పోరు..

జిల్లాలోని నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ ఏక తాటిపై నడిపే నాయకుడు లేకుండా పోయాడు. నాయకుల మధ్య సయోధ్య లేకపోవడంతో జిల్లాకు నామినేటెడ్ పోస్టు లు దక్కకుండా పోయాయి. జిల్లాపై ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి పెత్తనం సాగిస్తున్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో కాంగ్రెస్ అగ్రనాయకులు రోడ్డు ఎక్కి ఒకరి పై ఒకరు దుమ్మెత్తిపోసుకున్నారు.

అవిశ్వాసాలకు నిలయంగా 2024..

మేడ్చల్ నియోజకవర్గంలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్‌లలో 2024 సంవత్సరంలో అవిశ్వాసాలు పెట్టడంతో మేయర్లు మారారు. బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ల పీఠాలను అవిశ్వాసం తీర్మానంతో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లాక్కుంది. మున్సిపల్ చైర్మన్‌లు పదవులు కాపాడుకోవడానికి కాంగ్రెస్‌లో చేరిపోయారు. మెజారిటీ నాయకులు సైతం కాంగ్రెస్‌లో చేరి రాజకీయం నడుపుతున్నారు.

- బీఆర్ఎస్, బీజేపీలకు 2024 సంవత్సరం కలిసి రాగా కాంగ్రెస్‌కు రాష్ట్రమంతటా కలిసి వచ్చినా మేడ్చల్‌లో మాత్రం కలిసిరాకుండా పోయింది. బీఆర్ఎస్‌కు ఐదుగురు ఎమ్మెల్యేలు, బీజేపీకి ఎంపీ ఉన్నా కాంగ్రెస్‌కు చెప్పుకోవడానికి ఒక్క ప్రజాప్రతినిధి కూడా గెలవలేకపోయారు. వలసలు వచ్చిన కింది స్థాయి నాయకులే కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులయ్యారు.

మేడ్చల్ అభివృద్ధికి కృషి

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగునంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాను అన్నీ రంగాల్లో ప్రగతి పథంలో తీసుకెళ్లటానికి తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలు ప్రణాళిక బద్ధంగా లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. శివారు మేడ్చల్ జిల్లాను నగరానికి సమాంతరంగా అభివృద్ధి చెందాల్సిన అవసరముందన్నారు. ఐటీ, పారిశ్రామిక రంగాలతో పాటు వ్యవసాయ రంగం అభివృద్ధికి తగిన కార్యాచరణతో ముందుకు సాగుతామన్నారు. విద్యా, వైద్య రంగాలతోసహా సంక్షేమ రంగాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం- 2025లో ప్రజలు కొత్త ఆలోచనలు, సరికొత్త నిర్ణయాలు, మంచి ఆశయాలతో ముందుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటిస్తూ.. కొత్త సంవత్సరం వేడుకలను సంయమనంతో ఆనందంగా జరుపుకోవాలన్నారు. జిల్లా ప్రజలంతా కొత్త ఏడాదిలో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని అభిలాషించారు.

రాక్‌ఉడ్స్‌లో ఘనంగా ఫుడ్ ఫెస్ట్

కీసర: నాగారంలోని రాక్‌ఉడ్స్ పాఠశాలలో 2024 సంవత్సరాంతాన్ని ఫుడ్ ఫెస్ట్‌తో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు తమ సహవిద్యార్థులతో వంటకాలను పంచుకున్నారు. 2024వ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2025వ సంవత్సరాన్ని సంతోషంగా ఆహ్వానిస్తూ ఫుడ్ ఫెస్ట్‌ను వేడుకగా నిర్వహించారు. స్కూల్ చైర్మన్ రామానాయుడు, సీఈఓ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ పద్మ అయ్యంగార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో అందరూ సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

మన్నె సుబ్రహ్మణ్యం మృతి తీరని లోటు

కీసర: ప్రముఖ పారిశ్రామికవేత్త, మన్నె సుబ్రహ్మణ్యం అకాల మరణం అందరికీ తీరని లోటని పలువురు పేర్కొన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సుబ్రహ్మణ్యం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ మంగళవారం కీసరలో సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు మన్నె సుబ్రహ్మణ్యంకు ఉన్న సంబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కుషాయిగూడ, చర్లపల్లి, కీసర మండలంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి వందలాది మందికి ఉపాధి కల్పించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మన్నె సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పలువురు నేతలు ఘనంగా నివాళులర్పించి, పంచాయతీ కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. నేతలు సోమశేఖర్‌రెడ్డి, గుర్రం వరకాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

22 రోజులకు చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖకు చెందిన సమగ్ర శిక్షా ఉద్యోగులు, సిబ్బంది కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం నాటికి 22వ రోజుకు చేరుకున్నాయి. సమగ్ర శిక్షా ఉద్యోగులు జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు, సిబ్బంది కలెక్టరేట్ ఎదుట బోనాలతో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖలో ఏపీవోలు, డీపీవోలు, సాంకేతిక నిపుణులు, కంప్యూటర్ సహాయకులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలను అందించే భవిత కేంద్రాల్లోని ఉపాధ్యాయులు, రీసోర్సు పర్సన్లు నిరసన దీక్ష సమ్మెలో భాగస్వామ్యాన్ని పంచుకున్నారు. పాఠశాల స్థాయిలో ఆర్ట్, క్రాఫ్ట్, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, ఏఎన్ఎంలు, పీఈటీలు, అకౌంటెంట్లు, కంప్యూటర్ సహాయకులు, స్వీపర్లు తదితరులు కూడా 22 రోజులుగా సమ్మెలో ఉండటంతో విద్యాశాఖపై తీవ్ర ప్రభావం పడుతోంది. సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాలని, ఇప్పటి వరకు పేస్కేల్ కల్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా ప్రతినిధులు జగదీశ్వర్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

పోచారం: ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా చర్లపల్లి పారిశ్రామికవాడలో గంజాయి విక్రేత చిక్కాడు. ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ జూపల్లి రవి తెలిపిన వివరాల ప్రకారం.. నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో పెట్టుకొని వాహనాలు తనిఖీ చేస్తుండగా నేరేడ్‌మెట్‌లోని కాకతీయనగర్‌కు చెందిన చందన్ (37) ద్విచక్ర వాహనంలో 2 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా ఉత్తరప్రదేశ్ నుంచి గంజాయి తీసుకొచ్చి కాప్రా సర్కిల్ పరిధిలోని వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. మూడేళ్ల కింద ఇతనిపై గంజాయి కేసు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. ద్విచక్ర వాహనంతో పాటు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: పట్టణంలోని బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. కొర్రెముల్ గ్రామానికి చెందిన రమేష్ (45), గౌరీశంకర్ ద్విచక్రవాహనంపై సోమవారం మధ్యాహ్నం ఘట్‌కేసర్ వైపు నుంచి కొర్రెముల్‌కు వెళ్తుండగా బైపాస్ రోడ్డులో బైక్ అదుపుతప్పి వాగులో పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన చికిత్స నిమిత్తం వారిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రమేష్ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మేడ్చల్: పట్టణంలోని 4వ వార్డు కిష్టాపూర్‌లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి ప్రారంభించారు. కౌన్సిలర్ తుడుం గణేష్‌తో కలిసి చైర్‌పర్సన్ నిర్మాణ పనులను పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి, అధికారులు, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, కిష్టాపూర్ నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

పోచారం: యంనంపేట్‌లోని రైల్వే వంతెనపై గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో కొత్తగా రోడ్డు వేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ పోచారం మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేష్ కోరారు. మంగళవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు

రోడ్డు ఆక్రమించిన వారిపై కమిషనర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మర్పల్లిగూడకు చెందిన శివరాత్రి వెంకటేష్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఎదులాబాద్‌లోని సర్వేనెంబర్ 5 భాగంలో ప్లాటు నెంబర్ 38, 65 యజమానులు వీరారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి రోడ్డుపై షెడ్డు నిర్మించి ఆక్రమించారని లేఖలో తెలిపారు. అధికారులు స్పందించి కబ్జా నుంచి రోడ్డుకు విముక్తి కల్పించాలని కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



మేడ్చల్: పట్టణంలోని 4వ వార్డు కిష్టాపూర్‌లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి ప్రారంభించారు. కౌన్సిలర్ తుడుం గణేష్‌తో కలిసి చైర్‌పర్సన్ నిర్మాణ పనులను పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి, అధికారులు, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, కిష్టాపూర్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ సందర్శన



పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ తదితరులు

కీసర: భక్తుల కొంగు బంగారంగా పేరొందిన శ్రీ చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానాన్ని మంగళవారం మల్కాజ్‌గిరి ట్రాఫిక్ సీఐ రామలక్ష్మణరాజు, ఎస్సై మధు పరిశీలించారు. కొత్త ఏడాది పురస్కరించుకొని బుధవారం చీర్యాల ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వాహనాలు పార్కింగ్ చేసే ప్రదేశం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలను ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా సీ.ఐ మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామి దర్శనం అయ్యే విధంగా తగుచర్యలు చేపట్టడం జరిగిందని ఆలయ చైర్మన్ తెలిపారు.

అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న కేపీఆర్ఐటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఘనాపూర్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు (కేపీఆర్ఐటీ) చెందిన నలుగురు విద్యార్థులు హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం జట్టుకు ఒకరు నెట్ బాల్ జట్టుకు ఎంపికయ్యారు. దీప్తి, బన్నీయాదవ్, అనన్యరాజశేఖర్, గౌతమ్‌రాజ్, మనీషా ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ గేమ్స్‌లో ఆయా జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, వైస్ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ నెట్‌బాల్ క్రీడాకారులను మంగళవారం అభినందించారు.

ఘనంగా మండల పూజ

ఘట్‌కేసర్: ఎదులాబాద్ శ్రీ నాగలింగేశ్వర భ్రమరాంభిక స్వామి ఆలయంలో మండల పూజా కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విష్వేశ్వర, శివలింగ, నాగమాత తదితర ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విగ్రహ దాతలు రమేష్, సునిత దంపతులు, హరీష్ ఆచార్యులు, సీతారామాంజనేయులు శర్మ, ధర్మకర్తలు శంకరప్ప కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు న్యూ ఇయర్ వేడుకలు



ఘట్‌కేసర్: శ్రీ విద్యాఫౌండేషన్, మీసాల మల్లేష్ ఆధ్వర్యంలో ఆంగ్ల నూతన సంవత్సర ముందస్తు వేడుకలు ఘట్‌కేసర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య హాజరై కేక్ కట్ చేశారు. 2024వ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2025 నూతన ఆంగ్ల సంవత్సరానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైద్యుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు నర్సింగ్‌రావు, మల్లేష్, రవీందర్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, శ్రీనివాస్, నర్సింగ్‌రావు, నర్సింహా, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో పనిచేసిన వారికి డబ్బులు ఇవ్వాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో సమగ్ర కుటుంబ సర్వేలో ఇంటింటికి వెళ్లి సర్వే చేసిన ఎన్యుమరేటర్లకు ఇంతవరకు డబ్బులు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్వేలో పాల్గొన్న జవహర్‌నగర్‌కి చెందిన పలువురు విద్యార్థులు, గృహిణీలు మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ.. పస్తులు ఉండి సర్వేలో పనిచేశామని, 20 రోజులు గడుస్తున్నా డబ్బులు అడుగుతుంటే అధికారులు సమాధానం చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.